పంట మార్పిడి.. మేలైన దిగుబడి

- చీడపీడల నుంచి రక్షణ
- భూసారం పెంపు
- ఎరువులు, మందుల ఖర్చు ఆదా



పొలంలో విత్తనాలు వేస్తున్న కూలీలు

హొళగుంద: రైతులు భూముల్లో ప్రతి సారి సాగు చేసే పంటలనే మళ్లీ మళ్లీ వేస్తుండటంతో భూమిలో సారం తగ్గిపోయి పెట్టుబడులు పెరగడంతో పాటు దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయి. దీంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. పంటల మార్పిడి చేయడం వల్ల భూమిలో నాణ్యత పెరిగి దిగుబడులు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఖర్చులు కూడా తగ్గుతాయని మండల వ్యవసాయాధికారి నరేంద్రకుమార్ తెలిపారు.

ఒకేరకమైన పంటలతో చీడపీడలు

వాణిజ్య పంటలు లాభదాయకంగా ఉన్నందున రైతులు ఒకే పంటను అదే పోలంలో ప్రతి ఏడాది లేదా ప్రతి రుతువులో సాగు చేస్తున్నారు. దీని వలన భూసారం క్షీణించి, పంటలపై చీడపీడలు విజృంభించి దిగుబడులు క్రమేపి తగ్గుతున్నాయి. 2 లేదా 3 సంవత్సరాలకో సారైన పంట మార్పిడి చేస్తేనే చీడపీడలను అదుపులో ఉంచే అవకాశం ఉంటుంది. పంట మార్పిడిపై చాలా మంది రైతులకు అవగాహన లేదు. పంట మార్పిడితో భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెందడంతోపాటు చీడపీడలు దూరమవుతాయి. ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గించవచ్చు.

పంట మార్పిడితో లాభాలు

- పంట మార్పిడి వలన చీడపీడలను అదుపులో ఉంచవచ్చు. ఒక పంటను ఆశించే చీడపీడలు రెండవ పంటను ఆశించవు. ఉదాహరణకు మొక్కజొన్న వేసిన పొలంలో మిరప పంట సాగు చేయకుండా ఉంటే మంచిది. ఒక వేళ మిరప పంట సాగు చేస్తే నష్టం తప్ప లాభం వచ్చే అవకాశం లేదు.
- పంట మార్పిడిలో రెండు లేదా మూడు పంటలను పండించడం వలన ఏదైనా ఒక పంటకు గిట్టుబాటు ధర లేకున్నా వేరే పంటల వలన తగిన లాభం పొందవచ్చు. పంటల మార్పిడితో వివిధ పంటల్లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవచ్చు.
- రైతులు అందరూ ఒకే పైరు వేయడం మూలంగా చీడపీడల ఉధృతి అధికమై దిగుబడులు తగ్గడమే గాక మార్కెట్లో గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్నారు. మిర్చి, పత్తి, పొగాకు రైతుల అనుభవాలు మనకు తెలిసినదే.
- పంట మార్పిడి చేయడం వలన సస్యరక్షణ కోసం వాడే పురుగు మందులు ఖర్చు తగ్గించవచ్చు.
- వేర్లు భూమిలో తక్కువ లోతుకు చొచ్చుకొని పోయే పైర్లను, వేర్లు ఎక్కువ లోతుకు చొచ్చుకొని పోయే పైర్లతో పంట మార్పిడి చేయడం వలన భూమిలోని వివిధపొరల్లో ఉన్న తేమ పోషకాలను సమర్థంగా వినియోగించుకుంటాయి.
- పత్తి వేసిన పొలంలో మిరప పంట సాగు చేస్తే లాభసాటిగా ఉంటుంది.
- మిరప పంట వేసిన పొలంలో పత్తి పంట సాగు చేస్తే పెట్టుబడులు తగ్గడంతో సాగు దిగుబడులు కూడా పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అంతేకాకుండా మిరప పంట సాగు చేయడానికి ముందు సదరు భూమిలో జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పంటను సాగుచేసి, దాన్ని ట్రాక్టర్ ద్వారా తొక్కించిన తరువాత పంటను సాగు చేస్తే భూసారం పెరిగి చీడపీడలు దరిచేరవు.
- నులి పురుగులు ఉన్న ప్రాంతాల్లో టమాటా, బెండ, పెసర, మినుము పంటలు వేయరాదు. వాటిని వేస్తే పురుగులు మరింత అభివృద్ధి చెందుతాయి.
- పంట మార్పిడిలో భాగంగా నేలంతా పూర్తిగా కప్పే పంటలను ఎంపిక చేసుకోవాలి.
- వేరుశనగ, బొబ్బర్లు, పెసర, మినుము పంటలను వేయడంతో నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీనివల్ల కలుపు మొక్కలు అధికంగా రాకుండా నివారించవచ్చు.
- వరి పంట తర్వాత పప్పుధాన్యాల పంటలను కానీ నూనె గింజల పంటలను కానీ సాగు చేయడం వలన వరిని తెగుళ్లు ఆశించ కుండా ఉంటాయి.
- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు ఏడాదిలో రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది.
- తేలికపాటి నేలలు ఎర్ర ఇసుక, తువ్వ నేలల్లో మిశ్రమ పంటలను సాగు చేసుకోవచ్చు.
- కంది పంటను సాగు చేయడం వలన కింది పైరు ఆకులు రాలి కుళ్లిపోవడం వల్ల నేలలో సేంద్రియ పదార్థం పెరిగి భూ భౌతికస్థితి మెరుగుపడి భూసారం వృద్ధి చెందుతుంది. నేలలో నీటిని పట్టి ఉంచే శక్తి గణనీయంగా పెరిగి పంట దిగుబడులు పెరుగుతాయి.
- వేరుశనగ, కంది, పప్పుశనగ మొదలగు సాగు చేయటం వలన వాటి వేర్ల బుడిపెలోని రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజని స్థిరీకరించి నేలను సార వంతం చేస్తుంది.
- వాతావరణ కాలుష్యాన్ని నివారించి ప్రకృతిలో సమతుల్యతను పెంచడానికి వీలు కలుగుతుంది.

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం



పంట మార్పిడిపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. ఆర్బీకేల పరిధిలో అగ్రి కల్చర్ అసిసెంట్లు రైతులకు పంటమార్పిడి వలన కలిగే లాభాలను, ఏటా ఒకే పంట వేయడం వలన కలిగే నష్టాలను వివరించి, చైతన్యం కలిగిస్తున్నారు.

\- నరేంద్రకుమార్, ఏఓ

క్లుప్తంగా

ఆర్బీకేల్లో ఎరువులు



మద్దికెర ఆర్బీకేలో నిల్వవున్న ఎరువులు

మద్దికెర : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో రైతులకు కావలసిన ఎరువులను ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా పంపిణీ చేయడానికి అందుబాటులో ఉంచిందని ఏఓ హేమలత తెలిపారు. బుధవారం స్థానిక ఆర్బీకేలో వేరుశనగ విత్తనాలకోసం నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 13:13:0:13 ఎరువు 50 కిలోల బస్తా రూ.1300, 45 కిలోల యూరియా రూ.266, లిక్విడ్ యూరియా రూ. 225 ధరలు నిర్ణయించడం జరిగిందన్నారు. కావున ఎరువులు కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రాలలోని వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.

అక్రమ మద్యం విక్రయాలపై దాడులు

వెల్దుర్తి: మండలంలోని రామళ్లకోట, చెర్లకొత్తూరు గ్రామంలో కర్ణాటక టెట్రాప్యాకెట్ల మద్యాన్ని తెచ్చి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు కోడుమూరు సెబ్ ఇన్స్పెక్టర్ శ్యాంప్రసాద్, స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రెండ్రోజులుగా దాడులు నిర్వహించారు. దాడుల్లో రామళ్లకోటకు చెందిన ఈడిగ షేక్షావలి గౌడ్ వద్ద నుంచి 27, చెర్లకొత్తూరుకు చెందిన దొండల్ల తిరుమలేశ్ వద్ద నుంచి 480 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు బుధవారం ఎస్ఐలు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి డోన్ ఎక్సైజ్ మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

జోరుగా ఉపాధి పనులు



పెద్దకొత్తిలి వంకలో పనులు చేస్తున్న కూలీలు

నందవరం: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. వేసవి దృష్ట్యా గ్రామాల్లో కూలీలు ఉపాధి పనులకే మొగ్గుచూపుతున్నారు. జాబ్ కార్డు ఉన్న వారికి ఉపాధి హామీ పనులపై అధికారులు అవగాహన కల్పించడంతో యువకులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో పని ప్రదేశాల్లో కూలీలతో జాతరను తలపిస్తుంది. ఉపాధి కూలీలు చెక్‌డ్యామ్‌లు, చెరవులు, కాలువలో పూడిక తీత పనులు చేపడుతున్నారు.

ఆసరా డబ్బు జమ

తుగ్గలి: వైఎస్సార్ ఆసరా డబ్బులు స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో జమ అయినట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రాధాకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 673 సంఘాల్లో 6,914 మంది సభ్యులు ఉన్నారన్నారు. ఆసరా కింద రూ.3,82,2600 సంఘాల ఖతాల్లో జమ అయ్యాయన్నారు. ఆయా సంఘాల లీడర్లు తీర్మానం మేరకు సభ్యుల వ్యక్తిగత ఖతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. డబ్బులు జమ కావనే వదంతులు నమ్మవద్దని డ్వాక్రా మహిళలను కోరారు.

వీధి లైట్ల ఏర్పాటు



వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గంగవరం గ్రామాల్లో సర్పంచ్ బేటిగేరి శివన్న, పంచాయతీ కార్యదర్శి జ్యోతి ఆధ్వర్యంలో వీధి లైట్లు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా, రాత్రి సమయాల్లో ప్రజలు, రైతులు రాకపోకలకు సౌకర్యంగా ఉండేందుకు వీధిలైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతునట్లు వివరించారు.

రైతు భరోసా అర్హుల జాబితా ప్రదర్శన

గోనెగండ్ల: ఈ ఏడాది కొత్తగా రైతు భరోసాకు అర్హులైన జాబితాను ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో ప్రదర్శించినట్లు వ్యవసాయ అధికారి రాజా కిషోర్ బుధవారం తెలిపారు. మండలంలో 14,400 మంది రైతులు రైతు భరోసా నగదును తీసుకుంటున్నారని చెప్పారు. ఈ ఏడాది వీరితో పాటు మండలంలో మరో 337 మంది కొత్తగా రైతు భరోసాకు అర్హత పొందారని తెలిపారు.

మోడల్ స్కూల్ దరఖాస్తుకు నేడు ఆఖరు

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు గురువారంతో గడువు ముగుస్తుందని ఆ పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ బుధవారం తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష జూన్ 11న ఉంటుందని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దేవనకొండ: మండలంలోని ప్రజలు సీజనల్ జబ్బుల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శ్రీ నివాసులు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాలలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం ప్రత్యేక అధికారి శ్రీనివాసులు మాట్లాడారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. మురుగునీటిని కాలువలలో నిలవకుండా చూడాలన్నారు. తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఎంపీడీఓ గౌరీదేవి, మలేరియా అధికారి సాయిబాబ, సీహెచ్ఓ బాగ్యమ్మ పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీకి యత్నం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని మునెప్పనగర్‌లో ఊళ్లకు వెళ్లిన ఇద్దరు ఉపాధ్యాయుల ఇళ్లల్లో దొంగలు చోరీకియత్నించిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మునెప్ప నగర్, రాధాకృష్ణ కాలనీ శివారులో ఉపాధ్యాయులు ప్రసాద్, బావిగడ్డ నల్లారెడ్డిలు నివాసముంటున్నారు. వేసవి సెలవులు కావడంతో ఇళ్లకు తాళం వేసి తమ ఊళ్లకు వెళ్లిపోయారు. గమనించిన దొంగలు మంగళవారం అర్ధరాత్రి రెండు ఇళ్ల తాళాలు పగటగొట్టి లోపలికి చొరబడి బీరువాలు తెరిచి డబ్బు, నగలు ఉన్నాయోమోనని వెతికారు. ఏమి దొరకపోవటంతో చీరలు, వస్తువులు చెల్లాచెదారుగా పడవేసి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం ఇంటి పక్కల వాళ్లు గమనించి విషయాన్ని ఇంటి జయమానులకు వారు ఇంటికి చేరుకొని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ మధుసుదన్‌రావు బుధవారం రాత్రి చెప్పారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వెంకటాపురం వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెన్నకేశరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని వెంకటాపురం కాలనీ నుంచి మురవణి గ్రామం వైపు రూ.54లక్షలతో నిర్మించనున్న రోడ్డుకు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు కౌన్సిలర్ బజారితో కలిసి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఒక ప్రణాళిక మేరకు సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి ఏఐబీ స్కీం కింద మంజూరైన రూ.142కోట్లతో పైప్‌లైన్లు, ట్యాంక్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. అవి పూర్తయితే ఇంటింటికి కుళాయిలు మంజూరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, పీఆర్ ఏఈ శంకర్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, శివారెడ్డి, మధు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



చిప్పగిరిలో జగనన్న లే అవుట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి వేణుగోపాల్

చిప్పగిరి: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లులో భాగంగా చేపట్టిన గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్ ఆదేశించారు. బుధవారం స్థానిక జగనన్న లే అవుట్‌ను పరిశీలించారు. ఈ నెల 25 నుంచి థర్డ్ పార్టీ సహకారంతో నిర్మాణాలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్ రాజు, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఏపీఎం నాగార్జున, ఏఈ భవ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణల్లో పురోగతి సాధించాలి

నందవరం : జగన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లుకు హౌసింగ్ డీఈ ప్రసాద్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వివిధ దశల్లో ఉన్న ఇంటి నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇంటి నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైకేపీ ఎంపీఎం చిన్నవీరన్న, హౌసింగ్ ఏఈ గురుస్వామి పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగంగా జరిగేలా చర్యలు

కృష్ణగిరి: నవతర్నాలు–పేదలందరికీ ఇళ్లు కింద మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు వేగవంతంగా నిర్మించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డీఈ గురుప్రసాద్, మండల ప్రత్యేకాధికారి ఉమామహేశ్వరి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ మోహన్‌కుమార్, హౌసింగ్ ఏఈ షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ ఉమామహేశ్వరి

కృష్ణగిరి: గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ ఉమామహేశ్వరమ్మ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం గ్రామైక్య సంఘం సభ్యులు, వీఓఏలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులకు బాల్య వివాహాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామ, మండలస్థాయిలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, కమిటీలోని సభ్యులందరూ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ పురుషోత్తం, ఏపీఎం మహేశ్వరయ్య, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు సరోజతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం



వెల్దుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి/ కృష్ణగిరి: ఈ నెల 30న పత్తికొండలో వైఎస్సార్ రైతు భరోసా పథకం ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. వెల్దుర్తి, కృష్ణగిరిలో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ నెల 30తో నాలుగేళ్లు పూర్తవుతుందని, ఇదే రోజు సీఎం జగనన్న పత్తికొండ రావడం శుభ పరిణామన్నారు. ఈ ఖరీఫ్‌లో అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద అందిస్తున్న రైతు భరోసా పథకం కింద ఐదవ విడత సాయాన్ని బటన్ నొక్కి రైతుల ఖాతాలకు జమచేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోనే అత్యధికంగా పత్తికొండ నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా దాదాపుగా 52వేల మందికిపైగా లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, కంగాటి రామ్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్లు బొమ్మన రవిరెడ్డి, ఆర్‌బీ వెంకటరాముడు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల మనసు గెలుచుకున్న ప్రభుత్వం

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- హోసూరులో కొనసాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



హోసూరులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రధాన ఎజెండాగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల మనసు గెలుచుకుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని హోసూరు గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. ఇంటింటికి తిరుగుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలతో పొందిన లబ్ధిని వివరించారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాలు పేదల బతుకుల్లో వెలుగులు పూయిస్తున్నాయన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన హామీలను 90శాతం అమలు చేసి దేశంలోనే రికార్డును సృష్టించారన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో ఆపార్టీ కార్యకర్తలకే మేలు జరిగేదని, నేడు జగనన్న పాలనలో తమకు ఓటువేయని వారికి సైతం పథకాలను అందించి ఆదర్శ పాలకుడుగా నిలిచాడని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డికి అన్నవర్గాల ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఎంపీపీ నారాయణదాస్, హోసూరు సర్పంచు నాగప్ప, శ్రీనివాసులు, మోహన్, ఎంపీటీసీలు కేశప్ప, నెట్టేకల్, శాంతిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

హొళగుంద: అప్పగించిన పనులను అంకితభావంతో చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేక అధికారి రామచంద్రయ్య హౌసింగ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. బుధవారం హొళగుంద ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణ పనులకు సంబంధించి కొందరు లక్ష్యాన్ని చేరుకుంటుంటే, మరి కొందరు వెనుకబడి పోతున్నారన్నారు. హొళగుందలో 1, 2, 4 సచివాలయ పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాగా స్పందించారని, అలాగే సమీక్షా సమావేశాలకు తప్పక హాజరు కావాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీఓ దాసానాయక్, హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈఈ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీమ హక్కుల సాధనకు ఉద్యమాలు

పత్తికొండ రూరల్: సీమ హక్కుల సాధనకై ఉద్యమాలు చేపడతామని అరుణోదయ తెలుగురాష్ట్రాల చైర్మన్ విమలక్క అన్నారు. రాయలసీమ వలస కార్మికుల చైతన్య యాత్ర బుధవారం పత్తికొండకు చేరుకుంది. నాలుగు స్తంభాల కూడలిలో ప్రోగ్రాం ఆర్గనైజర్ రాజన్న అధ్యక్షతన సమావేశం జరిగింది. విమలక్క మాట్లాడుతూ రాయలసీమకు ప్రత్యేక పారిశ్రామిక పాలసీ ప్రకటించి నూతన పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. కరువు, వలసలను నివారించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. పత్తికొండ ప్రాంతంలో టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవివర్మ, శాంతరాజు, రాజ్‌కుమార్, తిరుమలేష్, సుజ్ఞానమ్మ, మణిరత్న, కళాకారులు పాల్గొన్నారు.

పార్టీని వీడింది అవకాశవాదులు

ఆలూరు: కాంగ్రెస్ పార్టీని వీడి ఇతర పార్టీలలో చేరే నాయకులు రాజకీయ అవకాశ వాదులని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకర్‌బాబు అన్నారు. ఆలూరులో ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఉన్న ఇబ్రహీమ్ ఫంక్షన్ హాల్లో బుధవారం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుధాకర్‌బాబు మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికంలోకి వచ్చిన వెంటనే నల్లధనాన్ని వెనక్కు రప్పిస్తానని హామీ ఇచ్చి నేడు కార్పొరేట్ సంస్థల అధినేతలకు వత్తాసు పలుకు తున్నారన్నారు. నాయకులు దేవిశెట్టి ప్రకాష్, నీలకంఠప్ప, సత్యనారాయణగుప్త, బాషా, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాయం చేయడంలో సంతృప్తి

కృష్ణగిరి: ఆపదలో ఉన్నవారికి, పేదవారికి సాయం చేయడంలో ఆత్మ సంతృప్తి కలుగుతుందని మాలమల్లేశ్వరస్వామి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నాగేంద్ర అన్నారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి చెందిన హంస్సేన్, లక్ష్మీదేవిల రెండో కూమార్తె వివాహానికి బుధవారం ఆయన పసుపుకుంకుమ, తాళిబొట్టును అందజేశారు.

పనులు వేగవంతం చేయండి



కురుకుందలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ శ్రీరాములు

ఆలూరు: సబ్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న సచివాలయ నూతన భవనాలు, నాడు–నేడు మన బడి పనులు, గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన సీసీ రోడ్లు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, ఆర్‌బీకే కేంద్రాల పనులను వేగవంతం చేయాలని పీఆర్ ఇంజినీర్లను డీఈ శ్రీరాములు ఆదేశించారు. హొళగుంద, హాలహర్వి మండలాల్లో జరుగుతన్న వైఎస్సార్‌హెల్త్ క్లీనిక్ కేంద్రాలు, నూతన సచివాలయ భవనాల పనులను బుధవారం పరిశీలించారు. అనంతరం స్థానిక డీఈ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ఆరు మండలాలో 93 గ్రామ సచివాలయాలు, 67 వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ కేంద్రాలు, 75 ఆర్‌బీకేలు కొనసాగుతున్నాయన్నారు. అయితే ఇప్పటి వరకు 25 సచివాలయాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చేత ప్రారంభించడం జరిగిందన్నారు. మరో 35 వరకు సచివాలయాల పనులు పూర్తయినట్లు తెలిపారు.

శ్మశాన సమస్యను పరిష్కరించండి

గోనెగండ్ల: మండల పరిధిలోని బి. అగ్రహారం గ్రామంలో నెలకొన్న శ్మశాన వాటిక సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం, కేవీపీఎస్ నాయకులు గ్రామానికి వెళ్లి ఇటీవల మృతిచెందిన మాల రాజశేఖర్, బోయ మారెమ్మ, చాకలి ఆదెమ్మ ఇళ్లకు వెళ్లి కుటుంబాలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రామాంజినేయులు, ఆనంద్ బాబు, కరుణాకర్, చిన్న రోషన్న తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మిగనూరుటౌన్: ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారాని లైఫ్‌ఇన్స్యూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫి) కృషి చేస్తుందని సంఘ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు జంపాల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్ఐసీ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సీఎం క్లబ్‌మెంబర్ శాశ్వత సభ్యుడిగా ఎన్నికైన రాజ్‌గోపాల్‌శెట్టిని, ఎల్ఐసీ ఏజెంట్లుగా ఉండి 1998 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన అక్బర్, జిక్రియ, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులను సన్మానించారు.

24 గంటలు విద్యుత్ ఇవ్వండి

గోనెగండ్ల: తాగునీటి అవసరాలకు గ్రామంలో 24 గంటలు కరెంట్ ఇవ్వాలని గ్రామ సర్పంచ్ హైమవతి కోరారు. బుధవారం ఆమె గ్రామస్తులతో కలిసి స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ సుధాకర్ రావుకు వినతి పత్రం అందజేశారు. విద్యుత్ కోతలు విధించడంతో ఎస్ఎస్ ట్యాంక్‌లోకి నీటిని పంపింగ్ చేసుకునేందుకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు.

పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకం



చిప్పగిరిలో అవార్డు గ్రహీతలతో అధికారులు, నాయకులు



శభాష్‌పురంలో వలంటీర్లను సన్మానిస్తున్న సర్పంచ్ పుష్పావతి, హనుమంతు

చిప్పగిరి: సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమని ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు బుధవారం స్థానిక గ్రామ సచివాలయంలో పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్ రాజు, తహసీల్దారు లక్ష్మీ నారాయణ, సింగిల్ విండో అధ్యక్షుడు మల్లికార్జున, పీఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

తుగ్గలి : వలంటీర్, సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు, సర్పంచ్ పుష్పావతి, వైఎస్సార్‌సీపీ రవి అన్నారు. బుధవారం శభాష్‌పురంలో సేవా రత్నకు ఎంపికైన బండపల్లి మల్లికార్జునతో పాటు సేవా మిత్ర వలంటీర్లకు శాలువ కప్పి, మెడల్, బ్యాడ్జి, ప్రశంసా పత్రాలు అందించి సత్కరించారు. అలాగే ఎద్దులదొడ్డి, పెండేకల్లులో వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి వలంటీర్లను సన్మానించారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

నందవరం : సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, ప్రత్యేక అధికారి హేమంత్ కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి జయరాముడు ఆధ్వర్యంలో పశువైద్యాధికారి హేమంత్‌కుమార్, గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి చేతుల మీదుగా వలంటీర్లు సేవ మిత్ర అవార్డులు అందుకున్నారు.